23 03 2017 EENADU

# క్రీడా వికాస కేంద్రాల నమూనాల రూపకల్పన

## స్పా విద్యార్థులకు బహుమతులు అందజేత

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ప్లానింగ్, ఆర్కిటెక్చర్ కళాశాల(స్పా) విద్యార్థులకు నిర్వహించిన క్రీడా వికాస కేంద్రాల (కేవీకే) నమూనా చిత్రాల రూపకల్పన పోటీల విజేతలను రాష్ట్ర క్రీడాశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రశంసించారు. ఈ పోటీల్లో 14 బృందాల నుంచి 37 మంది విద్యార్థులు పాల్గొనగా.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణ, భూ సారూప్యానికి అనుకూలంగా కేవీకేల నిర్మాణాలు చేపట్టేందుకు అయిదు నమూనా చిత్రాలు, ప్రణాళికలను ఎంపిక చేశామని శాప్ ఎండీ ఎన్.బంగార్రాజు మంత్రికి వివరించారు. ప్రత్యేక నిపుణుల బృందం వీటిని పరిశీలించి విజేతలను ప్రకటించిందన్నారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు నగదుతో పాటు రూ.2,500 చొప్పున నాలుగు ప్రోత్సాహక బహుమతులను ఎంపిక చేశాయన్నారు. అనంతరం విజేతలకు రాష్ట్ర క్రీడా శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శాప్ ఎండీ బంగార్రాజు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో శాప్ ఇన్‌ఛార్జి ఈఈ ఎ.హరిమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న రాష్ట్ర క్రీడాశాఖామంత్రి అచ్చెన్నాయుడు

ఆంధ్రజ్యోతి



గెలుపొందిన విద్యార్థులతో మంత్రి అచ్చెన్నాయుడు

# క్రీడా వికాస కేంద్రాల రూపకల్పన విజేతలకు బహుమతులు

**లబ్బీపేట స్పోర్ట్స్ :** రాష్ట్రంలోని క్రీడల అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం 175 క్రీడా వికాస కేంద్రాలు నెలకొల్పుటకు ఆదేశాలు జారీ చేశారని క్రీడాశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్తమ క్రీడా వికాస కేంద్ర రూప కల్పనకు శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆయన బుధవారం బహుమతులు అందజేశారు. అనంతరం శాప్ ఎండీ బంగార్రాజు మాట్లాడుతూ విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు క్రీడా వికాస కేంద్రాలు రూపకల్పనా పోటీలు నిర్వహించి, విజేతలను ప్రత్యేక నిపుణుల బృందం ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలను మంత్రి అందజేశారు.